క్లుప్తంగా

కంట్రోల్ రూమ్ ఏర్పాటు



అసెంబ్లీ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి కార్యాలయం

పెందుర్తి: సార్వత్రిక ఎన్నికల కోసం పెందుర్తి అసెంబ్లీ నియోజకవర్గ కార్యాలయంలో ప్రత్యేక కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసినట్లు రిటర్నింగ్ అధికారి శేష శైలజ ఓ ప్రకటనలో తెలిపారు. ఫిర్యాదులు, సందేహాలు, ఇతర అంశాల గురించి తెలుసుకునేందుకు హెల్ప్‌లైన్ నంబర్ 90637 83289 కేటాయించామన్నారు.

25న అయ్యప్పకు ప్రత్యేక పూజలు



పెందుర్తి: అయ్యప్ప స్వామి పుట్టినరోజు సందర్భంగా ఈ నెల 25న సుజాతనగర్‌లోని పూర్ణ పుష్కళ సమేత ధర్మశాస్త్ర అయ్యప్పస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేయనున్నట్లు ఆలయ ధర్మకర్త వాకా చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు. స్వామికి విశేష అభిషేకాలు, అర్చనలు చేస్తామన్నారు. ఆలయ ప్రాంగణంలో గణపతి హోమం జరుగుతుందన్నారు. భక్తులంతా తరలివచ్చి పూజల్లో పాల్గొనాలని కోరారు.

ఘనంగా లక్ష్మీదేవి పూజలు



అమ్మవారికి పూజ చేస్తున్న అర్చకుడు

పెందుర్తి: స్థానిక వెంకటాద్రిపై పాల్గుణ పక్షోత్సవాల్లో భాగంగా తొమ్మిదో రోజు బుధవారం ప్రత్యేక పూజలు జరిగాయి. శ్రీమహాలక్ష్మి అమ్మవారికి శ్రీసూక్త పారాయణం, ప్రత్యేక పూజలు జరిపారు. లక్ష్మీ హవనం, కుంకుమ పూజలు చేశారు. భక్తులకు ప్రసాద వితరణ చేపట్టారు.

హ్యాండ్ ఎంబ్రాయిడరీ కోర్సు ప్రారంభం



హ్యాండ్ ఎంబ్రాయిడరీ కోర్సును ప్రారంభిస్తున్న ప్రిన్సిపాల్ చంద్రశేఖర్

పెందుర్తి: పెందుర్తి ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలోని స్కిల్ హబ్ సెంటర్‌లో ప్రధానమంత్రి కుసల్ వికాస్ యోజన కార్యక్రమంలో భాగంగా బుధవారం హ్యాండ్ ఎంబ్రాయిడరీ కోర్సును ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.చంద్రశేఖర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మూడు నెలల పాటు ఈ కోర్సులో శిక్షణ అందిస్తామన్నారు. ఫ్యాకల్టీ కోఆర్డినేటర్ డాక్టర్ ఎం.నాగమణి, స్కిల్ హబ్ కోఆర్డినేటర్ బి.సౌజన్య, ట్రైనర్ మంజుల తదితరులు పాల్గొన్నారు.

హిందీ భాషాభివృద్ధిపై కమిటీ సమావేశం



విశాఖ వాణి మ్యాగజైన్‌ను ఆవిష్కరిస్తున్న డీఆర్‌ఎం సౌరభ్ ప్రసాద్, అధికారులు

తాటిచెట్లపాలెం: దొండపర్తిలోని డీఆర్‌ఎం కార్యాలయంలో బుధవారం డివిజనల్ అఫీషియల్ లాంగ్వేజ్ ఇంప్లిమెంటేషన్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ విభాగాల అధికారులతో గత త్రైమాసిక ఫలితాలు, 2024–25 సంవత్సర ప్రణాళికలు, రాబోయే రోజుల్లో హిందీ భాషాభివృద్ధికి తీసుకోవాల్సిన చర్యలు, శిక్షణ కోసం నమోదు వంటి విషయాల గురించి చర్చించారు. వాల్తేర్ డివిజన్ ప్రచురించిన విశాఖ వాణి మ్యాగజైన్‌ను డీఆర్‌ఎం సౌరభ్ ప్రసాద్ ఆవిష్కరించారు. హిందీ భాష ప్రాముఖ్యాన్ని అన్ని విభాగాల్లో తెలియజేసి, మరింత ఎక్కువ మంది వినియోగించేలా చేయాలని ఆయన సూచించారు. విశాఖ వాణి మ్యాగజైన్‌లో పలు శీర్షికలు రాసిన అధికారులను డీఆర్‌ఎం అభినందించి ప్రశంసా పత్రాలను అందజేశారు. కార్యక్రమంలో ఏడీఆర్‌ఎం(ఆపరేషన్స్) మనోజ్‌కుమార్ సాహూ, వాల్తేర్ డివిజన్ రాజభాషా అధికారి వీరేంద్ర కాజీ, ఇతర అధికారులు పాల్గొన్నారు.

ఆహ్లాదం.. ఆనందం.. ఆరోగ్యం

- జీవీఎంసీ 95, 97వార్డుల్లో అందుబాటులోకి పార్కులు
- విలీన ప్రాంతాల అభివృద్ధికి ప్రభుత్వం పెద్దపీట

పెందుర్తి: ప్రజలకు ఆహ్లాదం..ఆనందంతో పాటు ఆరోగ్యం ఇచ్చేలా పార్కులను ప్రభుత్వం అభివృద్ధి చేసింది. పచ్చని మొక్కలు పెంచడంతో పాటు పిల్లలు ఆడుకోవడానికి ఆట పరికరాలు ఏర్పాటు చేసింది. వ్యాయామానికి అవసరమైన పరికరాలతో పాటు విశాలమైన వాకింగ్ ట్రాక్‌లు అభివృద్ధి చేసింది. దశాబ్దాలుగా అభివృద్ధికి నోచుకోని పార్కులను సుందరంగా తీర్చిదిద్దింది. దీంతో చిన్నా పెద్దా తేడా లేకుండా అంతా పార్కుల బాట పడుతున్నారు. ఉత్సాహంగా గడుపుతున్నారు. జీవీఎంసీ 95, 97వ వార్డు ప్రాంతాల్లో పార్కులను అత్యంత సుందరంగా తీర్చిదిద్దడంతో పాటు



సుజాతనగర్ ఎ-జోన్‌లో ఏర్పాటు చేసిన సోలార్ సిస్టం

స్పోర్ట్స్ థీమ్, జిమ్‌లను సమకూర్చింది. దీంతో ఈ పార్కు కళకళలాడుతోంది.

పార్కుల్లో వైవిధ్య ఏర్పాట్లు

సుజాతనగర్ ప్రాంతంలోని పార్కులను విభిన్నంగా అభివృద్ధి చేశారు. సుజాతనగర్ ఎ–జోన్ పార్కును రూ.70 లక్షలు(1:2) పీపీపీ పద్ధతిలో ఆహ్లాదకరంగా తీర్చిదిద్దారు. ఈ పార్కులో జిమ్‌తో పాటు సోలార్ సిస్టం ఏర్పాటు చేశారు. పార్కులోనే స్థలం కేటాయించి ఆర్గానిక్ కూరగాయలు పండిస్తున్నారు. మొక్కలకు నీటి కోసం డ్రిప్ ఇరిగేషన్ అమర్చారు.



అద్భుతంగా తీర్చిదిద్దిన చినముషిడివాడ సత్యానగర్ పార్కు



సుజాతనగర్ సి-2జోన్‌లో ఏర్పాటు చేసిన షటిల్ కోర్టు



సుజాతనగర్ సి-1 జోన్‌లో ఏర్పాటు చేసిన ఏరోప్లెయిన్

- సుజాతనగర్ బి–జోన్ పార్కును రూ.6 లక్షలు(పీపీపీ పద్ధతి)తో అభివృద్ధి చేశారు. ఇందులో అత్యంత ఎక్కువ స్థాయి ఆక్సిజన్ ఇచ్చే మొక్కలు నాటారు. ఆక్సిజన్ అధికంగా ఇస్తాయని నాసా నిర్ధారించిన అరేక పాం, స్నేక్ ప్లాంట్, మనీ ప్లాంట్, రబ్బర్ ప్లాంట్, అలొవేర మొక్కలు ఈ పార్కులో పెంచుతున్నారు.
- సుజాతనగర్ సీ–1 జోన్ పార్కు అభివృద్ధికి రూ.6.60 లక్షలు కేటాయించారు. నిధులు సరిపోక పోవడంతో అదనంగా రూ.18 లక్షలు ప్రత్యేక నిధులు జీవీఎంసీ నుంచి కేటాయించి జిమ్ సౌకర్యం ఏర్పాటు చేసింది. పిల్లలు ఆడుకోవడానికి ఆట వస్తువులు, జిమ్, షటిల్ కోర్టు, కిడ్డీ ఏరో ప్లెయిన్ ఏర్పాటు చేశారు.



సుజాతనగర్ బి.జోన్‌లో ఆక్సిజన్ అధికంగా ఉత్పత్తి చేసే మొక్కలతో పార్కు

- సీ–2జోన్‌లో పీపీపీ పద్ధతిలో రూ.25 లక్షలు కేటాయించారు. దానికి అదనంగా మరో రూ.40 లక్షలు కేటాయించి స్కేటింగ్ రింక్ ఏర్పాటు చేసి పార్కుకు రంగులు, వాకింగ్ చుట్టూ విద్యుత్ దీపాలు ఏర్పాటు చేశారు.

భారీ స్థాయిలో స్పోర్ట్స్ థీమ్ పార్కు

రత్నగిరినగర్‌లో రూ.1.78 కోట్లతో స్పోర్ట్స్ థీమ్ పార్కును ప్రభుత్వం ఏర్పాటు చేసింది. ఈ పార్కులో క్రికెట్ నెట్, వాలీబాల్, రన్నింగ్ ట్రాక్, షటిల్ కోర్టుతో పాటు ఇతరాత్ర అన్ని రకాల ఆటలు ఆడుకునేందుకు వీలుగా సామగ్రి సమకూర్చారు. క్రీడలకు సంబంధించిన అన్ని సౌకర్యాలు ఈ పార్కులో ఉన్నాయి. ఇంత భారీ స్థాయిలో స్పోర్ట్స్ థీమ్ పార్కును ఏర్పాటు చేయడంలో నగర పరిధిలో ఇదే ప్రథమం.

- ఐదేళ్ల కిందట భయంకరంగా ఉన్న చినముషిడివాడ సత్యనగర్ పార్కును 2022లో రూ.2 కోట్లతో అత్యంత సుందరంగా తీర్చిదిద్దింది. ఈ ఏడాది ప్రారంభంలో లక్ష్మినర్సయ్యమ్మనగర్(ఎస్‌ఏడీ లేఅవుట్)లోని పార్కును రూ.64 లక్షలతో పార్కును అత్యంత సుందరంగా ముస్తాబు చేసింది ప్రభుత్వం.



పార్కులో కసరత్తులు చేస్తున్న కాలనీ వాసులు



రత్నగిరి నగర్ స్పోర్ట్స్ థీమ్ పార్కులో అమర్చిన సామగ్రి

అట్టహాసంగా పరదేశిమాంబ ఆలయ ప్రారంభోత్సవం



కలశస్థాపనకు ఆలయ చుట్టూ ప్రదక్షిణ చేస్తున్న భక్తులు



అమ్మవారి సన్నిధిలో ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ తదితరులు

సబ్బవరం: మండలంలోని ఆదిరెడ్డిపాలెంలోని నూతనంగా నిర్మించిన పరదేశిమాంబ ఆలయ ప్రారంభోత్సవాన్ని బుధవారం అట్టహాసంగా నిర్వహించారు.అమ్మవారి పసిడి కలశస్థాపన, యంత్ర స్థాపన,విగ్రహ ప్రతిష్ట కార్యక్రమాలను వేదపండితులు శాస్త్రోక్తంగా నిర్వహించారు.పసిడి కలశస్థాపనలో అధిక సంఖ్యలో భక్తులు,గ్రామ పెద్దలు పాల్గొని అమ్మవారి ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేసి కలశ స్థాపన చేశారు.వేకువజాము నుంచి గోపూజ,పీఠపూజలు, మహా పూర్ణాహుతి కార్యక్రమాలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. మధ్యాహ్నం అమ్మవారి సన్నిధిలో భారీ అన్నసమారాధన నిర్వహించారు.

అమ్మవారిని దర్శించుకున్న ప్రముఖులు

పెందుర్తి ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి చొక్కాకుల వెంకటరావు, మాజీ ఎమ్మెల్యే గండి బాబ్జీ, వైస్ ఎంపీపీ చొక్కాకుల గోవింద్, వైఎస్సార్‌సీపీ నాయకులు బోకం రామునాయుడు,గండి రవికుమార్, మండల జేసీఎస్ కన్వీనర్ సబ్బవరపు ముత్యాలనాయుడు, సర్పంచ్ దెడ్డం ప్రసాదరావు, భర్ణికాన బాబూరావు తదితరులు దర్శించుకున్నారు. ఆలయ కమిటీ నిర్వాహకులు కొటాన రాము, ఆర్‌ఈసీఎస్ మాజీ చైర్మన్ కొటాన అప్పారావు, ఎంపీటీసీ బైలపూడి దేముడు, కొటాన కోటయ్య, ఆదిరెడ్డి రమణ, ఆదిరెడ్డి పోతురాజు, గొంప దేముడు తదితరులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

వైభవంగా అప్పన్నకు ఆర్జిత సేవలు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి బుధవారం ఆర్జిత సేవలు వైభవంగా జరిగాయి. స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి,శ్రీదేవి,భూదేవిలను కల్యాణ మండపంలోని వేదికపై అధిష్టంపజేశారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, సంకల్పం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాలు ఘట్టాలతో కల్యాణం కమనీయంగా నిర్వహించారు.

- శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి బుధవారం గరుడసేవ ఘనంగా నిర్వహించారు. ఆలయ కల్యాణ మండపంలోని వెండిగరుడవాహనంపై స్వామివారి ఉత్సవమూర్తి గోవింద రాజస్వామిని అధిష్టంపజేసి అష్టోత్తర శతనామావళి పూజ చేశారు. భక్తులను గరుడవాహనం చుట్టూ ప్రదక్షిణ చేయించారు.



తలంబ్రాలు ఘట్టం నిర్వహిస్తున్న అర్చకులు

వర్షం.. హర్షం



ఎన్టీపీసీ ఏరియాలో కురుస్తున్న వర్షం



సబ్బవరం పోలీస్ స్టేషన్ సమీపంలో రోడ్డుపై నిలిచిన వర్షపు నీరు

పరవాడ: మండలంలో బుధవారం కురిసిన ఆకాల వర్షంతో ప్రజలు సేదతీరారు. వేసవి ప్రారంభం కావడంతో ఎండలకు ప్రజలు తల్లడిల్లుతున్నారు. బుధవారం ఉదయం నుంచి ఆకాశం మేఘావృతమై వాతావరణం ఒక్క సారిగా చల్లబడి మధ్యాహ్నం నుంచి వర్షం ప్రారంభమై మోస్తారు వర్షం కురిసింది. వర్షానికి లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. ఈ అకాల వర్షాలు మరో రెండు రోజుల పాటు కొనసాగుతాయని వాతావరణ శాఖ హెచ్చరికలతో తీర ప్రాంత మత్స్యకారులు సముద్రంపై చేపల వేట మానుకొని ఇళ్లకే పరిమితమయ్యారు. ఈ వర్షాలు రైతన్నలకు పెద్దగా అనుకూలించకపోయినా వాతావరణం చల్లబడడానికి దోహదపడుతుంది. మెట్ట పంటలకు దుక్కులు చేయడానికి ఉపయోగపడుతుందని రైతులు చెబుతున్నారు.

సబ్బవరంలో..

సబ్బవరం: మండల కేంద్రం సబ్బవరంతో పాటు గ్రామీణ ప్రాంతంలో బుధవారం మోస్తారు నుంచి భారీ వర్షం కురిసింది.దీంతో మండల వాసులకు వేసవి తాపం నుంచి కొంత ఉపశమనం లభించింది.గ్రామీణ ప్రాంతంలో కురిసిన ఈ వర్షానికి పశువుల మేతకు అవసరమైన పశుగ్రాసానికి,ఉద్యాన పంటల సాగుకు ఎంతో ఉపయోగపడుతుందని రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. సబ్బవరం పోలీస్ స్టేషన్ పరిసర ప్రాంతాలు జలమయం కావడంతో ప్రధాన రోడ్లపై వర్షపు నీరు నిలిచిపోయింది.

అభివృద్ధిపై చర్చకు సిద్ధమా!

- జనసేన నాయకులకు వైఎస్సార్‌సీపీ సవాల్
- 97వ వార్డులోనే రూ.13 కోట్లతో అభివృద్ధి పనులు
- వైఎస్సార్‌సీపీ వార్డు ఇన్‌చార్జి మెంటి మహేష్



మాట్లాడుతున్న మెంటి మహేష్

పెందుర్తి: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో పెందుర్తి అర్బన్ ప్రాంతం గతంలో ఎన్నడూ లేని విధంగా అభివృద్ధి చెందిందని వైఎస్సార్‌సీపీ 97వ వార్డు ఇన్‌చార్జి మెంటి మహేష్ అన్నారు. అభివృద్ధి గురించి తప్పుడు కూతలు కూస్తున్న జనసేన నాయకులు దీనిపై చర్చకు సిద్ధమా అని సవాల్ విసిరారు. సుజాతనగర్‌లో ఆయన బుధవారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. మూడేళ్లలోనే 97వ వార్డు పరిధిలో దాదాపు రూ.13 కోట్ల నిధులతో 61 పనులు జరిగాయన్నారు. ఎన్నో ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న సుజాతనగర్, పులగానిపాలెం రోడ్డును వైఎస్సార్‌సీపీ ప్రభుత్వమే పూర్తి చేసిందని చెప్పారు. ఇక్కడ జరిగిన అభివృద్ధి జనసేన నాయకులకు కనిపించలేదా అని ప్రశ్నించారు. ఎన్నికల్లో అదీప్‌రాజ్ అఖండ మెజారిటీతో విజయం సాధిస్తారని మహేష్ పేర్కొన్నారు. పార్టీ నాయకులు కిల్లి దేముడు, కిల్లి అప్పారావు, నరవ బంగారునాయుడు, రాంబాబు, మండా గౌరి, మాధవి, రజని తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు వైద్య పరీక్షలు



విద్యార్థులను పరీక్షిస్తున్న వైద్య సిబ్బంది

పరవాడ: సింహాద్రి ఎన్టీపీసీ ఫ్లాగ్‌షిప్ ప్రాజెక్టులో భాగంగా బాలికా సాధికారిత మిషన్–2024 పురస్కరించుకొని దీపాంజలినగర్ జీవన్‌రేఖ ఆస్పత్రిలో బుధవారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో 5వ తరగతి చదువుతున్న విద్యార్థినులు పాల్గొని ఉచిత వైద్య సేవలు పొందారు. వైద్యులు విద్యార్థినులను పరీక్షించి మందులు ఉచితంగా అందజేశారు.

వ్యవసాయంలో ఏఐ సాంకేతికతపై అవగాహన



అభిరామ్ సరస్వతిని సత్కరిస్తున్న ప్రిన్సిపాల్ శ్రీనివాస రావు

ఏయూ క్యాంపస్: వ్యవసాయ రంగంలో ఆర్టిఫీషియల్ సాంకేతికత(ఏఐ) ఉపయోగాలపై అమెరికాలో స్థిరపడిన డాక్టర్ అభిరామ్ సరస్వతి అవగాహన కల్పించారు. బుధవారం ఏయూ జువాలజీ విభాగంలో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో ఆయన విద్యార్థులనుద్దేశించి మాట్లాడారు. టీ కాబ్స్–ఈ నిర్వాహకులు డాక్టర్ వై.రవికిరణ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య కె.శ్రీనివాసరావు, జువాలజీ విభాగాధిపతి ఆచార్య పి.జానకీరామ్ ప్రసంగించారు.

వైద్యవృత్తిలో నిబద్ధత అవసరం



ఆంధ్ర మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ బుచ్చిరాజు సత్కరిస్తున్న కళాశాల ప్రతినిధులు

పెందుర్తి: వైద్య వృత్తిలో నిబద్ధత, నిజాయతీ అవసరమని ఆంధ్ర మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జి.బుచ్చిరాజు అన్నారు. సుజాతనగర్‌లోని సన్ కాలేజ్ ఆఫ్ ఫిజియోథెరపీ కళాశాలలో బుధవారం వైట్ కోట్ ఓత్ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైద్య రంగంలో పారామెడికల్, ఫిజియోథెరపిస్ట్ పాత్ర చాలా కీలకం అన్నారు. విద్యార్థులు ఉన్నతస్థాయిలో నిలవాలని ఆకాంక్షించారు. ఫిజియోథెరపీలో ఉపాధి అవకాశాలు మెండుగా ఉన్నాయని చెప్పారు. కార్యక్రమంలో విద్యార్థులతో ప్రమాణం చేయించారు. కేజీహెచ్ అసిస్టెంట్ సూపరింటెండెంట్ డాక్టర్ వాసుపల్లి రవి, సన్ కళాశాల సీఎండీ జి.తేజస్విని, సిబ్బంది పాల్గొన్నారు.

కాలువలు శుభ్రం చేయాలని వినతి

పరవాడ: స్థానిక ఎస్సీ కాలనీ, బీసీ కాలనీల్లో కాలువలు చెత్తా చెదారాలతో నిండిపోయి ఇబ్బందులు పడుతున్నామని ఆయా కాలనీల ప్రజలు వాపోతున్నారు. పూడికలను గ్రామ పంచాయతీ సిబ్బంది ఎప్పటికప్పుడు తొలగించకపోవడంతో దోమలు బెడద వి పెరిగి రాత్రి వేళ కంటి మీద కునుకు లేకుండా చేస్తున్నాయని కాలనీ వాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు తక్షణమే స్పందించి పూడికలు తొలగించడానికి చర్యలు చేపట్టాలని మండల ఎస్సీ సెల్ అధ్యక్షుడు ములకలపల్లి రమణ కోరారు.

కేంద్ర ప్రభుత్వం దిగి వచ్చేవరకు పోరాటం

కూర్మన్నపాలెం: ఉక్కు కార్మికుల పోరాటం భావితరాలకు స్ఫూర్తిదాయకమని ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ నాయకులు అన్నారు. వారి సంకల్పానికి, పోరాట శక్తికి ప్రభుత్వరంగ సంస్థల ప్రైవేటీకరణ విషయంలో కేంద్ర ప్రభుత్వం దిగి రాక తప్పదన్నారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెంలోని ప్లాంట్ ఆర్చి వద్ద చేపడుతున్న రిలే నిరాహార దీక్షలు బుధవారానికి 1133వ రోజుకు చేరుకున్నాయి. ఈ దీక్షలో స్టీల్‌ప్లాంట్‌లోని పలు విభాగాల కార్మికులు, ఉక్కు నిర్వాసితులు పాల్గొని, కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ కార్మిక వ్యతిరేక విధానాలను కార్మికులంతా ఐక్యంగా ఎదుర్కొంటామన్నారు. కార్యక్రమంలో పోరాట కమిటీ నాయకులు, ఇతర కార్మికులు పాల్గొన్నారు.

ఈవీఎంల వినియోగంపై శిక్షణ



మాక్ పోలింగ్‌పై శిక్షణ ఇస్తున్న మాస్టర్ ట్రైనీ మహేష్

మధురవాడ : సార్వత్రిక ఎన్నికల్లో ఈవీఎంల నిర్వహణ, వాటిని భద్రపరచడం ముఖ్యమైన విషయాలని మాస్టర్ ట్రైనీ రెడ్డి మహేష్, నోడల్ అసిస్టెంట్, ఏపీఐఐసీ మేనేజర్ లోహికుమార్ చెప్పారు. విశాఖ తూర్పు నియోజకవర్గం–21 పరిధిలో సెక్షన్ ఆఫీసర్లు, రూట్ ఆఫీసర్లకు ఎన్నికల నిర్వహణపై మధురవాడ జోనల్ కార్యాలయంలో శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. 5 రోజుల కార్యక్రమంలో భాగంగా ఇక్కడ బుధవారం రెండవ రోజు శిక్షణ ఇచ్చారు. విశాఖ తూర్పు నియోజకవర్గంలో 25 సెక్టార్లు ఉండగా వీరిలో రోజుకు 5 సెక్టార్లకు చెందిన సిబ్బందికి శిక్షణ ఇచ్చారు. వీరికి మాక్ పోలింగ్, పోలింగ్‌లో తలెత్తే సాంకేతిక, ఇతర అంశాలు, వీటిని తెరవడం దగ్గర నుంచి క్లోజ్ చేసి స్ట్రాంగ్ రూంకి తరలించే వరకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు తదితర అన్ని విషయాలు కూలంకుషంగా వివరించారు.

శ్రీవారికి లక్ష తులసీదళార్చన



లక్ష తులసి పూజ చేస్తున్న రుత్వికులు

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ టౌన్‌షిప్‌లోని వేంకటేశ్వర స్వామి ఆలయంలో బుధవారం లక్ష తులసి పూజను ఘనంగా నిర్వహించారు. వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా సాయంత్రం రుత్వికులు ఆధ్వర్యంలో శాస్త్రోక్తంగా అర్చన చేశారు. అంతకు ముందు ఆలయ ప్రధానార్చకులు భావ నారాయణ స్వామి, హరి నారాయణ స్వామి ఆధ్వర్యంలో రుత్వికులు శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు చేశారు. ఉక్కునగరం, పరిసర ప్రాంతాల భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ ప్రతినిధులు పలువురు పాల్గొన్నారు.